

# సుఖం లేని మని…

చందు సోంబాబు

అయిదు దాటుతుండగా ఆఫీసులోంచి బయటపడ్డాడు శ్రీనివాసరావు. అతనికి చాలా చికాగ్గావుంది. అయినా ఇంటికి వెళ్ళాలని లేదు. భారంగా నడుస్తూ వెళ్ళి టాంక్ బండ్ పైన ఓ బల్లపైన కూర్చున్నాడు.

అక్కడ అంతగా జనంలేరు. హుస్సేన్ సాగర్‌పైనించి వీచే చల్లగాలి హాయిగావున్నా శ్రీనివాసరావు అందులోని అందాన్ని గమనించే స్థితిలో మాత్రం లేడు. అతనికింటికి వెళ్ళాలంటే భయంగా వుంది.

ఇక సంసారం ఈదడం తనవల్ల కాదనిపిస్తోంది శ్రీనివాసరావుకి. ఏ రోజు కారోజే ఓ గండం. అది పరిపాటయిపోయింది ఓ విధంగా అతనికి. కష్టపడి చదువుకొని, డిగ్రీలు సంపాదించి గుమాస్తా బ్రతుకయిపోయిన జీవితంపైన అమిత

మైన విరక్తిని పెంచుకొన్నాడు శ్రీనివాస రావు తనకొచ్చే జీతం సంసారం గడప టానికి చాలదు. తన చదువుకీ, తన సంసా రానికీ, తన కష్టానికీ సరిపడని ఉద్యోగం. తన తాహతుని మించిన సంసారం. తల్లి, భార్య, స్కూలుకెళ్లే కుర్రాడు, పాలుతాగే పసిపిల్ల, చదువుకొంటున్న తమ్ముడు సత్యం. ఇంతమంది అతని వెనకవున్నారు.

శ్రీనివాసరావు కణతలు నొక్కు కొన్నాడు.

తనకింకా ముప్పైసంవత్సరాలు రాలేదు. కానీ ఏభై సంవత్సరాల అనుభవం మాత్రం వచ్చింది.

"ఇంటికెలా వెళ్లేది?" అనుకొన్నాడు.

జేబులు తడువుకొన్నాడు. చిల్లరడబ్బు లున్నాయి. అంతే! తల్లికిమందు, పసి దానికి పాలడబ్బా, బాబ్జీగాడికి స్కూలుఫీజు కట్టాలి.

నెలలో మూడోవారం అది. ఆ సమ యంలో ఓజానికి తనలాంటి వాడిదగ్గర చిల్లరడబ్బు లుండడమే గొప్పవిశేషం.

తను పడుతోన్నబాధ ఎలాంటిదో సర స్వతికి తెలుసు.

సరస్వతి గనక, అన్ని కష్టాలు తనతో సమానంగా పంచుకొని భూదేవిలా భరి స్తోంది. అదే మరో ఆడదైతే, తనవల్ల కీ భారం వహించడం చేతకాదని ఎప్పుడో పారిపోయివుండేది.

సరస్వతికి నెలక్రితం అయిదోనెల్లో ఎబార్షన్ అయింది. చాలా కష్టమైపోయింది. అప్పట్నుంచీ చాలా నీరసంగా వుంటోంది సరస్వతి. డాక్టరు టానిక్కులు వాడమని చెప్పాడు.

ఇవేమీ తనవల్ల కావు. తానెం చెయ్య లేడు.

తన అసమర్థతని తల్చుకొంటే ఆ సమ యంలో అతనికి హుస్సేన్‌సాగర్లో దూకి చచ్చి పోవాలనిపించింది.

చల్లగాలి ప్రారంభమయింది. వర్షం వచ్చేలా వుంది.

లేచి నడవడం ప్రారంభించేడు. గాలికి రోడ్డుపైన దుమ్ము చక్రాల్లా లేస్తోంది.

శ్రీనివాసరావు అయిదు నిమిషాల్లో లిబర్టీ దగ్గర బస్సుస్టాపు చేరుకున్నాడు. అక్కడ జనం విపరీతంగా వున్నారు. శ్రీని వాసరావుకి నవ్వొచ్చింది.

నగరంలో జనం లేని చోటేది?

బస్సుల్లో, సినిమా హాల్లో, రోడ్లపైన, కాలేజీల్లో, ఆఫీసుల్లో, ఎక్కడ చూసినా జనమే. ఆ మహా ప్రవాహంలో తనూ ఒకడు.

బస్సొచ్చింది. జనంతోపాటు అతనూ బస్సుపైన ఎగబడ్డాడు. బస్సు ఎక్క డువ్వ పట్టుకొని పుట్‌బోర్డు పైన ఒక కాలుంచి, బస్సుని అందుకోగలిగేడు.

బయట విపరీతంగా గాలి వీస్తూనే వుంది. ఇప్పుడు అతనికి త్వరగా ఇల్లు చేరుకోవాలనుంది. ఇంటికెళ్లగానే తన వంక ఆశగా చూసే మొహాలు గుర్తుకొచ్చే సరికి మనసు తల్లడిల్లి పోయింది.

ఆతనికప్పుడు చంద్ర గుర్తుకొచ్చేడు. శ్రీనివాసరావు అనుకున్నాడు. వాడి దగ్గర కెళ్తే డబ్బు కొంతైనా దొరక్క పోదు. తనెప్పుడూ వాడ్ని అడగలేదు. చంద్రనే కాదు, ఏ స్నేహితుడి దగ్గరా ఎప్పుడూ

డబ్బు అడిగే ప్రయత్నం చెయ్యలేదు తను. అవసరానికి తప్పనిసరైతే వడ్డీకి తీసుకొంటాడే గానీ, స్నేహితుల్లో చవక కావడం మాత్రం అతనికి ఇష్టంలేదు.

తనని చూస్తే స్నేహితులు జేబులు సర్దుకొనే పరిస్థితికి రాకూడదని అతని అభిప్రాయం. కానీ తాహతుకి మించిన అప్పులు చేసేశాడు. ఇప్పుడు అప్పులు కూడా దొరికే పరిస్థితిలో లేదు.

చంద్రని అడగాలి. తప్పదు. అడిగితే కాదనే మనస్థత్వం కాదు వాడిది.

నారాయణగూడా దగ్గర బస్సు దిగేశాడు. చంద్ర ఇంటివేపు గబగబా నడిచేడు శ్రీనివాసరావు.

శ్రీనివాసరావు వెళ్లేసరికి చంద్ర ఇంట్లో పదమూడు ముక్కల మహాసభ జోరుగా సాగుతోంది. శ్రీనివాసరావుని చూస్తూనే చంద్ర ఆప్యాయంగా పలకరించి తిరిగి ఆటలో పడిపోయాడు. శ్రీనివాసరావు చంద్ర పక్కన కూర్చున్నాడు

శ్రీనివాసరావుకి పేకాట రాకపోలేదు కానీ ఆడే అలవాటు లేకపోడానికి కారణం అతని చాలని జీతం.

అందులో ఒకతను అడిగేడు.

''మీకు సీటుగానీ కావాలా?'' అని.

''అబ్బే నేను ఆడను'' అన్నాడు శ్రీనివాసరావు.

చంద్ర నవ్వి,

''మావాడు మరీ పాపాత్ముడండీ బాబూ ఒక్కమంచి అలవాటూ లేదు'' అన్నాడు.

శ్రీనివాసరావు నవ్వి ఊరుకున్నాడు.

అంతలో కుర్రాడు టీలు పట్టుకొచ్చేడు. చంద్ర శ్రీనివాసరావుకి ఓకప్పు అందించి, తిరిగి ఆటలో పడ్డాడు.

శ్రీనివాసరావు ఏదో అడగాలన్నట్టుగా,

''స్టేకెంత?'' అన్నాడు.

ఫైవ్ టెన్-ఏం? దూకుతావా?'' అడిగేడు చంద్ర. సమాధానం ఇవ్వకుండా టీతాగి ఖాళీకప్పు పక్కనపెట్టేసి ఆటవంక చూస్తూ కూర్చున్నాడు.

ఆట ఎప్పుడు ఆపుతారో తెలీదు.

ఆటమధ్యలో డబ్బు అడగకూడదు. అది పేకాటలో పెద్ద సెంటిమెంటని తెలీక పోలేదు శ్రీనివాసరావుకి.

ఇంటికిపోయి తాను చెయ్యవలసిందీ ఏమీలేదు. ఓ విధంగా తాను ఆలస్యంగా ఇంటికిపోతేనే మంచిది. అందరూ నిద్ర పోతారు. ఉదయం తను నిద్రలేచేసరికి తమ్ముడు కాలేజీకీ, బాబ్జీగాడు స్కూలుకు వెళ్ళిపోతారు. భార్యకేదో చెప్పి బయట పడ్డం తనకి తేలికవుతుంది.

శ్రీనివాసరావు చూస్తూండగానే చంద్ర నాలుగు కౌంటులిచ్చేడు.

శ్రీనివాసరావుకి గుండె చెరువైంది.

వాడివెయ్యి మరీ చచ్చుగావుంది. తన అదృష్టం బాగా లేదు. లేచినించుని ''వెళ్ళొస్తా''నని చెప్పి బయటపడ్డాడు.

నారాయణగూడాకి చిక్కడపల్లి పెద్ద దూరం ఏమీకాదు. మహా అయితే అయిదారు నిమిషాల నడకచాలు.

పది దాటుతూండగా ఇల్లు చేరాడు.

అతననుకొన్నట్టుగా తమ్ముడు సత్యం నిద్రపోవడంలేదు. ఏదో రాసుకొంటున్నాడు. పసిది నిద్రపోతోంది. బాబ్జీగాడు

మంచంపైన పడుకొని దొంగచూపులు చూస్తున్నాడు. మధ్యమధ్య తల్లిదగ్గు వినబడుతోంది.

స్నానంచేసి, ఏమీ మాట్లాడకుండా లుంగీ కట్టుకొని, తువాలు భుజంపైన వేసుకొని వంటగదిలోకి నడిచేడు. సరస్వతి అతనికి వడ్డించింది.

పీటపైన కూర్చుంటూ,

''అందరి భోజనాలు అయినాయా?'' అడిగేడు.

''ఆ .. మీరు వున్నారు. అంతే!'' అన్నది.

సరస్వతి మాటలకి అర్థం తెలుసు. మీరువున్నారు అంటే తన తర్వాత తను వుందన్నమాట.

భోజనం ముగించి తన గదిలోకి వెళ్ళిపోయాడు. సరస్వతి మరోగంట తర్వాత గానీ అతని దగ్గరకి రాలేదు.

బాజ్జీగాడు నిద్రపోతున్నాడు. సత్యం లైటార్పేసి పడుకొన్నాడు.

కిటికీలోంచి మసకవెన్నెల ఆ గదిలోకి పడుతోంది

వెన్నెల వెలుగులో సరస్వతిని దగ్గరికి తీసుకొంటూ.

''సరూ! నాలాంటి పేదవాడు భర్తగా దొరికినందుకు బాధ పడ్తున్నావు కదూ?'' అడిగేడు.

సరస్వతి చేతితో అతని పెదవుల్ని మూసింది.

భర్త కళ్ళల్లోకి ప్రేమతో కూడిన చూపుల్ని చూస్తూ,

''ఇంకెప్పుడైనా ఇలాంటి మాటల్ని మాట్లాడితే నా పైన ఒట్టు'' అంది.

శ్రీనివాసరావు సరస్వతి చెక్కిళ్ళను చేతుల్తో సవరిస్తూ ఆమె మొహాన్ని దగ్గరగా తీసుకొన్నాడు. సరస్వతి చిక్కిపోయింది. ఊపిరిలేని బొమ్మలా శరీరం తయారైనా ఆ కళ్ళలో మాత్రం అపురూపమైన కాంతి కొట్టొచ్చినట్టుగా వెన్నెల వెలుగులో అతనికి కనుపించింది.

''సరూ! నీ తలలో పూలుచూసి ఎన్నిరోజులైందో తెలుసా? నీకు కనీసం, ఓ పావలా పువ్వులు కూడా తేలేని జీవితం అయిపోయింది నాది'' నిస్పృహ ధ్వనించిందతని మాటల్లో.

సరస్వతి కళ్లల్లో కన్నీళ్లు మంచి ముత్యాల్లా మెరిసాయి.


''భలేవారే స్వామీ! ఇప్పుడు మన మేమీ కొత్త దంపతులం కాదు కదా ముచ్చట్లు తీర్చుకోడానికి. మీరు సుఖంగా వుంటే నా కదే పదిలక్షలు.'' అంది సరస్వతి.

''కానీ ...సరూ!'' అతనేదో చెప్పబోయాడు.

''మీ రిలా ప్రతి చిన్నవిషయానికీ బాధ పడితే శిక్ష ఏమిటో తెలుసా?'' పవిటచెరగుతో ఓ సారి మొహాన్ని వత్తుకొని అడిగింది.

''ఏమిటీ?''

''మిమ్మల్ని మాట్లాడకుండా చేస్తాను' అంటూ అతని పెదవుల్ని సున్నితంగా తన పెదవులతో తాకింది సరస్వతి. ఆ తర్వాత కొంతసేపు ఇద్దరిమధ్య మాటలులేవు అలసటతో సరస్వతి వడిలోనే నిద్రలో!




జారిపోయాడు శ్రీనివాసరావు.

* * *

మర్నాడు శ్రీనివాసరావు లేచేసరికి సత్యం బయటికి వెళ్ళిపోయాడు.

బాబ్జీగాడు మాత్రం ఇంకా బడికి వెళ్ళలేదు.

తన పనులన్నీ ముగించుకొని భార్య కోసం చూసేడు. పసిదానికి గదిలో పాలిస్తోంది సరస్వతి. తల్లిదగ్గర పాలులేక పోవడంచేత కాబోలు పసిముండ ఏడుస్తోంది. అప్పుడతనికి పాల డబ్బా గుర్తొచ్చింది.

వూపిరి లేకుండా, నిస్సత్తువుగా, బలహీనంగా వున్న సరస్వతి దగ్గర ఏముంటుందనీ? వెక్కిపడుతూనే పసిముండ ఆత్రంగా సరస్వతి చేతుల్లో ఎగబడుతుంటే శ్రీనివాసరావుకి చాలా బాధ అనిపించింది.

"సరూ!" అని పిలిచేడు బొంగురుపోయిన గొంతుతో.

సరస్వతి పిల్లని పడుకోబెట్టి అటొచ్చింది.

అంతలోనే అత్తగారి పిలుపు వినబడ్డంతో,

"ఇప్పుడే వస్తాను," అంటూ వెళ్ళిపోయింది.

తల దువ్వుకొంటుంటే తల్లి మాటలు వినబడుతూనే వున్నాయ్.

"ఏమే అమ్మాయ్! అబ్బాయి మందు తెచ్చేడా?"

సరస్వతి గొంతు చాలా తగ్గుస్థాయిలో వినిపించింది.

"లేదత్తయ్యా, ఈ రోజు తెస్తారు. వారికి గుర్తుచేస్తాను."

"నాకు తెలిసే, పిచ్చివెధవ తెగ అవస్థ

పడిపోతున్నాడు. వాడికి చెప్పమ్మా, బాధ పడవద్దని చెప్పు. ఈ మందులూ మాకులూ వాడితే మాత్రం నేను లేచి తిరిగి ఏం చెయ్యగలను గనుక.''

సరస్వతి ఏమీ సమాధానం చెప్పలేదు.

శ్రీనివాసరావు సరస్వతి మొహంలోకి పరీక్షగా చూసేడు.

''అమ్మ ఏమంటుంది?'' అడిగేడు.

సరస్వతి కొంచెం తడబడింది.

''ఏమీ లేదండి. మీరు ఆఫీసుకు వెళ్లారా లేదా అని అడుగుతున్నారు?'' అన్నది.

శ్రీనివాసరావు తిరిగి ఏమీ ప్రశ్నించ లేదు; కారణం అది అబద్ధం అని తెలుసు.

''వడ్డిస్తాను రండి,'' అంది.

''వద్దు సరూ, నాకు మనసు ఏమీ బాగో లేదు. ఈ పూట భోజనం చెయ్యను.''

అంతలో బాబ్జీగాడు.

''డాడీ'' అంటూ పరుగెత్తుకొచ్చాడు.

శ్రీనివాసరావుకి ఆ మాట వినగానే చిర్రెత్తు కొచ్చింది.

''ఒరే, వళ్లు చీరేస్తాను. ఈ సారి డాడీ అని పిలిచావంటే, డాడీ ఏమిట్రా వళ్ళు బలిసిన మాటలు. నాన్నా అని పిలి చేడవలేవూ?''

''మమ్మీ, డాడీ అని పిలవమంది డాడీ'' అన్నాడు బాబ్జీ.

శ్రీనివాసరావు బాబ్జీ వీపు నిమురుతూ,

''ఒరే బాబ్జీ, మనం తెలుగు వాళ్లంరా. అందులోనూ నేను గుమస్తా గాడ్ని. మన కోసం కాకపోయినా, బయట వాళ్ళ కైనా వెరవాల్రా. నన్ను డాడీ అని పిలవడం, ఎవరైనా వింటే నవ్వి పోతారు. నాన్నా, అని చక్కగా పిలవరా'' అన్నాడు.

''ఐతే 'డాడీ' అని పిలవకూడదా?'' వాడు అమాయకంగా అడుగుతోంటే జాలి కలిగింది శ్రీనివాసరావుకి.

''పిలవ కూడదు అంతే! ఎందుకో తెలుసురా-డాడీ అనబడే నాన్నగారింటి ముందు ఒక కారు వుండాలి. పెద్ద మేడ వుండాలి. ఆఫీసరు హోదా, దానికి తోడు ఓ బొచ్చుకుక్కా వుండాలి. అప్పుడు మన సాంప్రదాయల్ని, భాషనీ మర్చిపోయి, డాడీ మమ్మీ అని మొదలెడతార్రా పారాలు. ఒరేయ్ బాబ్జీ, నేను నీకు డాడీని కాను. నాన్ననిరా బాబూ నాన్నని.'' అని తట్టీ గబగబ బయటికి నడిచేడు.

ఆఫీసులో కూర్చున్నాడన్న మాటే గానీ, ఏ పనీ చెయ్యా బుద్ధి కాలేదతనికి. శెలవు పెట్టడానికదీ లేదు.

శ్రీనివాసరావు సిగిరట్టు వెలిగించాడు. సూపరింటెండెంటు రాలేదు. అదీ ఒక నయమే. అడిగే వాడుండడు. క్యాంటీన్లో కాఫీ తాగడానికి టిక్కట్లు తన దగ్గ రుంటాయి. అవి ముందే కొని దగ్గర వుంచుకొంటాడు.

క్యాంటీన్లోకి నడిచేడు శ్రీనివాసరావు.

క్యాంటీన్లో రద్దీగానే వుంది. ఓ మూల చలపతి, రంగారావు, మరో ఇద్దరు గుమ స్తాలు గుర్రాలు గురించి మాట్లాడు కొంటు న్నారు. నలుగురి చేతుల్లోనూ రేసు పుస్త కాలున్నాయి. వాళ్ల మాట్లాడే పద్ధతి వింటుంటే మతి పోతోంది. ఒక్కడికీ ఎప్పుడూ డబ్బులు వచ్చిన పాపాన పోలేదు. కానీ కబుర్లు చాలా పెద్ద స్థాయిలో వున్నాయి.

చలపతికి క్రితం రోజు రెండు లక్షలు వచ్చేవట. అనుకోకుండా మరో గుర్రం గెలవడంతో అదృష్టం చెయ్యిజారి పోయిందిట.

శ్రీనివాసరావు కాఫీగ్లాసుతో వెళ్ళి వాళ్ళపక్కనే కూర్చున్నాడు.

రంగారావు శ్రీనివాసరావుని పలకరించేడు.

"ఏం గురూ, నీకులేదా ఈపిచ్చి?"

"లేదు గురుగారు. నాకు వాటిగురించి బొత్తిగా తెలీదు" అన్నాడు.

చలపతి కల్పించుకొని అన్నాడు.

"చూడుగురూ, మనం గుమస్తా వెధవలం, ఇలాంటి జన్మలు పదెత్తినా కనీసం పూరిగుడిసెకూడా కట్టుకోలేం. కారణం గొర్రెతోకలు మనవి మిగిలిన వెధవల్ని చూడు. ఈరోజు చూసినవాడు మర్నాటికి బలిసిన ఆంబోతులై పోతున్నారు. బ్లాక్ మనీ పరుపులెక్కి పడుకొని నిద్రపట్టక ఛస్తున్నారు. పరుపులు మనకి దొరక్కపోవచ్చు కనీసం దుప్పటి దొరికినా కొంత మెరుగ్గా బ్రతకొచ్చు. ఏమిటీ? ఒప్పుకొంటావా?"

ఒక విధంగా చలపతి మాటలు నిజమే. కానీ దేనికైనా కొంత పెట్టుబడి అవసరం. అదీకాక తన ఆఫీసులోనే శర్మగారికి వారం క్రితం అయిదువేలు వచ్చాయి. కానీ ఆయన కొచ్చేయని, తనకి రావాలన్న 'రూలేమీ' లేదుకదా.

శ్రీనివాసరావు కాఫీ పూర్తిచేసి సిగరట్టు వెలిగించాడు,

అందరూ లేచారు. శ్రీనివాసరావు మాత్రం కూర్చునె వున్నాడు. చలపతి తిరిగి అయిదునిమిషాల్లో వచ్చాడు. శ్రీనివాసరావు ముందుకూర్చుని సిగరట్టు వెలిగించి అన్నాడు.

"చూడుగురూ. నిన్నుగురించి చూచాయగా నాకు తెలుసు. ఒక విధంగా చెప్పాలంటే మనంఅంతా ఒకేరకం మనుషులం మధ్యతరగతి వెధవలం, కాబట్టి పరుపు కోసం పాకులాడి, బయటపడి ఛావలేక దిగులుపడి చస్తాం."

"ఈ ఉపోద్ఘాతం ఎందుకో అర్థం గావడంలేదు" అన్నాడు శ్రీనివాసరావు.

అప్పుడు చలపతి నవ్వేడు.

"ప్రయత్నం లేనిదే ఏదీ జరగదు. లక్షరూపాయలు నిన్న కార్నీటపర్ అయింది. తిరిగి రేపు రేసుంది. రేపు తప్పకుండ కొట్టేస్తానని నమ్మకంగా వుంది" అన్నాడు.

"ఇంతకీ నన్నేం చెయ్యమంటావ్?" అన్నాడు శ్రీనివాసరావు.

"నువ్వుకూడా ఓయాభై చూడు. నాకు తెలిసిన జాకీ, టిప్స్‌కూడా ఇస్తున్నాడు. కాదనకు" అన్నాడు చలపతి,

"సారీగురూ, నాదగ్గర ఏమీలేదు" అన్నాడు శ్రీనివాసరావు లేదని చెప్పడానికి బాధ పడుతూనే.

అప్పుడు చలపతి పగలబడి నవ్వేశాడు.

"భలే జోకుచేస్తావు గురూ, అదేమిటి చేతికి ఉంగరంలేదూ? రేపు సాయంత్రం ఇటువంటివి వంద చేయించుకోవచ్చు" అన్నాడు.

శ్రీనివాసరావుని చాలా ఇబ్బంది పెట్టేశాడు చలపతి.

శ్రీనివాసరావు చాలాసేపు ఆలోచించాడు. ఈ నికృష్టపు బ్రతుకు బ్రతికేకంటే ఒసారి ప్రయత్నిస్తే తప్పేమిటీ? అని పించింది.

అదీకాక వాడు అంత ఖచ్చితంగా చెపుతున్నాడు.

శ్రీనివాసరావు చేతి ఉంగరంతీసి చలపతి కిచ్చేడు.

ఆ సాయంత్రం శ్రీనివాసరావు, చలపతీకలసి నడచివస్తుంటే అనుకోకుండా శ్రీనివాసరావు దృష్టి ఓ రిక్షా పైనపడింది. అందులో తన తమ్ముడు సత్యం, వాడి పక్కన గౌను, బెల్‌బాటం ప్యాంటు వేసుకొన్న ఓ అమ్మాయివున్నారు.

శ్రీనివాసరావుకి చాలా కష్టం అనిపించింది.

వాడిని తనెంతో కష్టపడి చదివిస్తున్నాడు. వాడు చేస్తోన్నదేమిటీ? అసలు కాలేజీకి వెళ్తున్నాడా? లేదా? ఫీజులు అవీ సరిగా కడుతున్నాడా లేదా?

తన నెంత కష్టపడి చదివిస్తోంది తెలీని వయస్సేమీ కాదు వాడిది. కానీ వాడు చేస్తోందేమిటీ?

తనదృష్టి అటుపడకపోయినా బాగుండేది అనుకొన్నాడు.

వాడిని మందలించాలి. కాని బుద్ధెరిగిన తర్వాత ఎప్పుడూ తమ్ముణ్ని తిట్టెరగడు. సరస్వతికి చెబితే!

మరిదిపైన చెడు అభిప్రాయం కలుగుతుందేమో. కానీ సరస్వతి దేవతలాంటిది. అయినా తను చెప్పలేదు. వాడిని అడగనూ లేదు.

రాత్రి ఎనిమిది గంటల వేళ సత్యం ఇంటికొచ్చేడు. తనతో పాటే భోజనం చేశాడు. అటు తర్వాత సత్యాన్ని పిలిచి అన్నాడు.

''పదరా, అలా బయట కెళ్ళొద్దాం.''

సత్యం అన్నగారితో పాటు బయటకొచ్చేడు. వెన్నెల్లో నారాయణగూడా వంతెనపై కూర్చున్నా రిద్దరూనూ.

ఎలా ప్రారంభించాలో అర్థం కాలేదు శ్రీనివాసరావుకి.

''ఎప్పుడూ లేంది ఏమిటన్నయ్యా. రాత్రి పూట బయటికి తీసుకొచ్చావ్?'' అడిగేడు.

''ఏం లేదురా, వెన్నెల బాగుంటేను'' అనగలిగేడు.

మరో పదినిమిషాల తర్వాత,

''పదరా పోదాం'' అన్నాడు.

దారిలో మాత్రం అన్నాడు.

''చూడరా,మనలాంటి వాళ్లకి చదువేరా ఆధారం. అదే అటు బ్రతకడానికీ, ఇటు ఛావడానికీ వీల్లేకుండా ఆధారపడేది. చదువుని అశ్రద్ధచేయకు.''


సత్యం అన్నగారి మొహంలోకి చూసి,

''అలాగే అన్నయ్యా '' అన్నాడు.

ఇద్దరూ తర్వాత మరేం మాటలు లేకుండానే ఇల్లు చేరుకొన్నారు.

మర్నాడు — రేసుకోర్సు గ్రౌండులో చలపతి చేస్తున్న హంగామా చూస్తుంటే, శ్రీనివాసరావుకి ఆశ్చర్యం కలిగింది. అలాంటిచోటుకి వెళ్ళడం అదే మొదటి సారతనికి.

రకరకాల మనుషులు. అందరి మొహాల్లోనూ, లక్ష్మీదేవిని తాడుపెట్టి కట్టేసి,




లాక్కుని పోవాలన్న తపన, కోరికా కనబడుతోన్నాయి. ఖరీదైన మనుషులు, మధ్య తరగతి మనుషుల సమ్మేళనంగా వుంది అక్కడి వాతావరణం.

మైకులో మధ్య మధ్య ఎనౌన్స్‌మెంట్లు వినబడుతున్నాయి. బుక్కీలదగ్గర జనం విపరీతంగా వున్నారు. చలపతి శ్రీనివాసరావుని చెయ్యిపట్టి లాక్కెళ్ళాడక్కడికి.

ఓ సూటువాలా వందకాగితాలని లెక్క పెట్టి ఇస్తూ నెంబరు ఫోర్ 'సరిత' అనే గుర్రంపైన పందెంకాసేడు ఎవరిష్టం వచ్చిన వాటిపై వాళ్ళు కడుతున్నారు.

చలపతి నూట ఇరవై పెట్టి జాక్‌పాట్ కాంబినేషన్ టిక్కట్టు తీసాడు అందులో వరసగా అయిదు రేసుల్లోనూ అయిదు గుర్రాలు గెలవాలి

రేసు ప్రారంభమయింది. గుర్రాలు పరుగెత్తు కొస్తున్నాయి. చలపతి అరుస్తున్నాడు శ్రీనివాసరావు దేవుళ్ళందర్నీ ప్రార్థించేడు మూకంగా పరిగెత్తి వస్తున్న గుర్రాలు తన పాలిట లక్ష్మి కావాలని శ్రీనివాసరావు మనసులో పదే పదే అనుకొన్నాడు. అతనికదో విధమైన వణుకు కూడా ప్రారంభమైంది. చలపతి కట్టిన గుర్రమే గెలిచింది. చలపతి గంతులు వేస్తున్నాడు.

శ్రీనివాసరావు ఉత్సాహంగా చలపతి భుజం తట్టి. ''కంగ్రాచ్యులేషన్స్'' అన్నాడు.

''బాంక్ కొట్టేసినట్టే గురూ హుంషారుగా వుండు'' అన్నాడు.

త్వరగా వరుసగా మూడు రేసుల్లో కూడా చలపతి నెంబర్లు వచ్చేయి.

చలపతికీ శ్రీనివాసరావుకీ కూడా భూమి

బాద కాళ్లు నిలవలేదు. నాలుగో రేసుకి మిగిలిన టిక్కట్లు రెండేనట-ఆఖరి నంబరు కూడా వస్తే రెండు లక్షల రూపాయలు. తనకీలక్ష, చలపతికి లక్ష. దరిద్రం తీరి పోతుంది.

స్పెషల్‌గా ఓ డాక్టర్ని పెట్టి తల్లికి ట్రీట్‌మెంటు ఇప్పించాలి. సరస్వతికి మంచి చీరలు, నగలు కొనాలి. బాబ్జీ గాడ్ని కాన్వెంటులో చదివించాలి. సత్యాన్ని ఇంజనీరుగా చెయ్యాలి. వెధవది చేసి చేసి విసుగొచ్చిన గుమస్తా వుద్యోగాన్ని వదిలేయాలి. ఎన్నాళ్ళ నించో అనుకోడం మోటారు సైకిలు కొనుక్కోవాలని.

శ్రీనివాసరావు చేతి గడియారం వంక చూసుకొన్నాడు. టైం ఆగిపోయి వుంది. విసుక్కున్నాడు రేసుకోర్సునించి ఇంటికి వెళ్ళేటప్పుడు దారిలో మూసీ నదిలో పారేయ్యాలను కొన్నాడు.

నుదుట పట్టిన చమటని తుడుచుకొని టీ తాగొచ్చి కూర్చున్నాడు.

ఆఖరి రేసు అయింది. తనకు కావల్సిన నెంబరు గుర్రం ఓడిపోయింది.

చలపతి మొహంలో నెత్తురు చుక్కలేదు.

శ్రీనివాసరావుకి కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది.

చలపతి భారంగా నించుని,

"పదరా పద, పోదాం" అన్నాడు

"మనకి పోయినట్టేనా?" అడిగేడు శ్రీనివాసరావు ఆశ చావక అన్నట్టుగా.

చలపతి పేలవంగా నవ్వి.

"అదృష్టం ఇంకా కలిసి రాలేదు. అఫ్‌కోర్స్ దిగులు పడకు. చూశావుగా వెంట్రుక 'వాసిలో' లక్ష్మి చెయ్యి జారి పోయింది."

శ్రీనివాసరావు అప్రయత్నంగా అన్నాడు.

"మనం దరిద్రులంరా. మన మొహం చూస్తే లక్ష్మికి పరమ అసహ్యం. చూసి చూసి మన దగ్గరకి ఎలా వస్తుంది?" బయటకొస్తుండగా అన్నాడు.

"అఫ్‌కోర్స్. అఫ్‌కోర్స్. కానీ మన ప్రయత్నం చేసేకే కదరా. అది మాత్రం మనకు తెలిసింది. వుయ్‌విల్ ట్రై ఎగేన్" అన్నాడు చలపతి

అప్పుడు శ్రీనివాసరావు దిగులుగా చేతివంక చూసుకొని,

"పెళ్ళికి మా వాళ్ళిచ్చిన ఉంగరం!" అని నసిగాడు.

చలపతి బెరుగ్గా చూశాడు.

"వెధవ వుంగరం గురించి మాట్లాడుతున్నావే కానీ, మా ఆవిడ మంగళ సూత్రం గురించి మాట్లాడవేంరా?" అన్నాడు అతని మాటలకి.

దేశంలో తనలాంటి సగటు మనుషులు లక్షలకొద్దీ వున్నారు. ఆ లక్షల జనాభాలో తనూ ఒకడు. అందరిలాగే తనూ....

అతనికి ఇల్లు దగ్గరవుతూండగా తల్లికి మందు, సరస్వతికి టానిక్కులు, పసిపిల్ల పాల డబ్బా, బాబ్జీగాడి బడి ఫీజు, సత్యం కాలేజీ ఫీజు గుర్తుకొచ్చినాయి.

శ్రీనివాసరావు భారంగా అడుగులు వేశాడు. ★